


శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## జువ్వలదిన్నె హార్బర్ వద్దకు కొట్టుకొచ్చిన గుర్తు తెలియని పాప మృతదేహం



**బిట్రగుంట, ఆగస్టు 30 ప్రభాతవార్త** బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో సుమారు పది సంవత్సరాల వయసు కల్గిన గుర్తు తెలియని పాప మృతదేహాన్ని కనుగొన్నట్లు బిట్రగుంట ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపారు. హార్బర్ సమీపంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ఒడ్డుకు చేరివున్న గుర్తు తెలియని పాప మృతదేహాన్ని గుర్తించి బిట్రగుంట పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శేఖర్‌బాబు కావలి రూరల్ సిఐ రాజేష్‌కు తెలియజేయడంతో ఇరువురు సంఘటన ప్రదేశానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సమాచారాన్ని అన్ని పోలీస్ స్టేషన్లకు తెలియపరుస్తున్నామని ఎక్కడైనా సముద్రానికి వెళ్లి గల్లంతై ఇక్కడికి ఒడ్డుకు కొట్టుకువచ్చిందా, ఇతరత్రా కారణాలు ఏమైనా వున్నాయా అనే కోణాలలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా ఆచూకి తెలిస్తే కావలి రూరల్ సిఐ సెల్ నెంబరు 94406796334కు గానీ బిట్రగుంట ఎస్ఐ సెల్ నెంబరు 9440796338కు కానీ సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నేడు కొండబిట్రగుంటలో శ్రావణ పౌర్ణమి గరుడ సేవ ఉత్సవం

**బిట్రగుంట, ఆగస్టు 30 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 31వ తేది నిజశ్రావణ మాస పౌర్ణమి గరుడ సేవ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ప్రతి మాసంలో వచ్చే పౌర్ణమికి శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి సన్నిధిలో శ్రీవారి గరుడ సేవ నిర్వహిస్తుండటం తెలిసిందే. ఈ గరుడ సేవ ఉత్సవానికి ఉభయకర్తలుగా స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి, ఆయన సతీమణి మాగుంట పార్వతమ్మల కుమారుడు మాగుంట విజయ్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించనున్నారని కావున శ్రీవారి సన్నిధిలో జరిగే ఈ గరుడ సేవ ఉత్సవాన్ని భక్తులు తిలకించి శ్రీ స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి

**వరికుంటపాడు, ఆగస్టు 30, ప్రభాతవార్త :** మేకల మేతకు వెళ్లి విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని అశోక్‌నగర్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వరికుంటపాడు ఎస్సై విజయ్ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు ప్రకాశం జిల్లా పామూరు మండలం తిరగలదిన్నే గ్రామానికి చెందిన గజ్జల పెద్దవెంగయ్య(52) తన జీవనాధారమైన మేకల కోసం మేతకు అశోక్‌నగర్ సమీపంలో కి వెళ్ళి ఆకులు సందర్భంలో తన వద్ద ఉన్న ఇనుముతో చేసిన పైపు తో ఆకులు కోస్తుండగా దగ్గర గా ఉన్న 11 కె.వి విద్యుత్ తీగలు ఆ ఇనుము పైపు తగలడంతో షాక్ గురై మృతి చెందారన్నారు. మృతుని పొట్టపైన, బ్రొటన వ్రేళ్ల పై గాయాలయ్యాయని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామనీ ఎస్సై విజయ్ శ్రీనివాస్ తెలిపారు.

## కన్నుల పండుగగా రంగనాధుని గోపురోత్సవం




**నెల్లూరు, ఆగస్టు30 ప్రభాతవార్త-విద్య** శ్రీ తల్పగిరి రంగనాథస్వామి మారి పమిత్రోత్సవాల్లో భాగంగా 6వ వరోజు బుధవారం ఉదయం నిత్యహోమాలు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం గోపురోత్సవాలను కన్నుల పండుగగా చేపట్టారు. అనంతరం స్వామివారికి అమ్మవారి సమేతంగా ఊరేగింపు నిర్వహించారు. హోమాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను వియోగించారు. ఈ కార్యక్రమంలో ఉభయ కర్తలుగా శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి భక్త బృందం వ్యవహరించింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణ అధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, దేవస్దాన చైర్మన్ ఈలపాక శివకుమార్ ఆచారి, అర్చక స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డు మృతికి పోలీసులు నివాళులు



**ఉదయగిరి ఆగష్టు 30 ప్రభాతవార్త** మండలకేంద్రమైన ఉదయగిరిలోని పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న ఫిరోజ్ ఆలీ అలియాస్ రబ్బానీ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఉదయగిరి సర్కిల్ ఇనస్పెక్టర్ గిరిబాబు హోంగార్డు కుటుంబాన్నికి తన ప్రగాఢసానుభూతిని తెలిపారు. హోంగార్డు పార్థివ దేహాన్ని స్వయంగా ఆయన మోశారు. పోలీస్ కుటుంబసభ్యులలో ఒకరైన ఫిరోజ్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు.

## ఇళ్ళల్లోకి చేరిన వర్షపు నీరు



**వరికుంటపాడు, ఆగష్టు 30, ప్రభాతవార్త :** ప్రభుత్వాలు మారుతున్నాయి..పాలకులు మారుతున్నారు ...ఎన్నికల సమయంలో మాత్రమే తమ కు అది చేస్తాం ఇది చేస్తాం అంటూ ప్రగల్భాలు పలకడమే తప్ప తాము ఎదుర్కొంటున్న సమస్యలను మాత్రం ఎవ్వరు పరిష్కరం చూపడం లేదంటూ పెద్దిరెడ్డిపల్లి బిసి కాలనీ వాసులు తమ గోడును వెళ్ళబుచ్చుతున్నారు. చిన్నపాటి చినుకులు పడినా ఇంటిలోని నుండి బయటకు రావాలంటే మోకాల్లోతు నీటిలో నడవాల్సిన పరిస్థితి నెలకొందనీ వారు ఆవేదన వ్యక్తం చేస్తూన్నారు. బుధవారం నాడు కురిసిన వర్షానికి సరైన రోడ్లు లేకపోవడం, డ్రైనేజి కాలువలు లేకపోవడంతో నీళ్ళు ఇళ్ళలోకి చేరాయి. ఈ కాలనీ లో సుమారు 110 కుటుంబాల వారు నివసిస్తుండగా అక్కడికి వెళ్ళే ప్రధాన రహదారి సరిగా లేకపోవడం తో చినుకు పడితే చిత్తడి చిత్తడిగా మారి, ప్రజలు నడవాలంటే నరకం కనబడుతుందనీ స్థానికులు ఆవేదన చెందుతున్నారు. రోడ్ల పై పడిన నీరు కాస్త ఇంటి ముందుకు చేరుతుడడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జీవాలు ఉన్న వారి పరిస్థితి అయితే నరకప్రాయంగా ఉందనీ, తాము నిలవడానికే ఇబ్బందులు పడుతున్నామనీ, జీవాలను ఎలా కాపాడుకోవాలో అర్థం కావటం లేదనీ స్థానికులు వాపోతున్నారు. అలాగే నీరు ఇళ్ల వద్దకు చేరడంతో అంటూ రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి అధికారులైన తమ గోడును పట్టించుకొని, తమ సమస్యలను పరిష్కరించాలనీ కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

## 4న ఆత్మకూరులో జగనన్నకు చెబుదాం

**నెల్లూరు అర్బన్, ఆగష్టు 30, ప్రభాతవార్త** సెప్టెంబరు 4న సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఉదయం 10.30గంటకు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందరూ స్పందనకు హాజరు కావాలి. ఆత్మకూరు డివిజన్‌లోని ప్రజలు తమ సమస్యలు, విజ్ఞాపనలు, అర్జీలతో ఆర్డీఓ కార్యాలయానికి వచ్చి జిల్లా కలెక్టర్‌కు అందజేయవచ్చు. ఆ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో సోమవారం జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ జగనన్నకు చెబుదాంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు.

# జిల్లాను అభివృద్ధిపథంలో ముందంజలో నిలిపేందుకు ప్రణాళికలు



**నెల్లూరు అర్బన్, ఆగష్టు 30, ప్రభాతవార్త** జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మాత్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పరిశ్రమల శాఖ మత్స్యశాఖ, ఎస్సీ కార్పొరేషన్ సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, జిల్లా వెనుకబడిన తరగతులు, జిల్లా మైనార్టీ కార్పొరేషన్, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా అటవీ శాఖ తదితర శాఖలకు సంబంధించిన అజెండా అంశాలపై చర్చించగా పలువురు జడ్పీటీసీ, ఎంపీపీలు పలు సమస్యలను మంత్రి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింత చేరువ చేయడానికి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు దృష్టి సారించి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కార దిశగా ప్రగతి వైపు అడుగులు వేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ నాలుగు అంశాలను సమావేశం ఆమోదం కొరకు ప్రవేశపెట్టడం జరిగింది. 46 మండలాల పరిషత్ కార్యాలయాల్లో జడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేకంగా ఒక గదిని నిర్మించాలని, ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులకు విజయ దీపిక పుస్తకాన్ని పంపిణీ చేయాలని, నెల్లూరు నగరంలోని పాత జిల్లా పరిషత్ కార్యాలయాన్ని తొలగించి ఆ స్థలంలో కమర్షియల్ భవనాన్ని నిర్మించాలని, నూతన జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో అతిధి గృహాన్ని నిర్మించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదించడం జరిగింది. చైర్‌పర్సన్ ప్రతిపాదించిన 4 ప్రతిపాదనలను సర్వసభ్య సమావేశం ఆమోదించింది. జిల్లా పరిషత్ చైర్పర్సన్ ప్రతిపాదించిన ప్రతిపాదనలకు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచనలు చేస్తూ.. పాత జిల్లా పరిషత్ కార్యాలయం ఉన్న స్థలం చాలా విలువైందని, మంచి ఆర్కిటెక్చర్‌ను నియమించుకొని ప్రణాళిక బద్ధంగా నిర్మాణం, చేపడితే జిల్లా పరిషత్‌కు ఆదాయ వనరులుగా ఉంటుందని తెలిపారు. అలాగే మండల కేంద్రాల్లో పెట్రోలు బంకులకు మంచి డిమాండ్ ఉందని, మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో అవకాశం ఉంటే పెట్రోలు బంకులకు స్థలం కేటాయిస్తే కూడా జిల్లా పరిషత్‌కు ఆదాయ వనరులుగా ఉంటుందని జిల్లా కలెక్టర్ సూచన చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డ్వామా, డీఆర్‌డీఏ పరిశ్రమల శాఖ, మత్స్యశాఖ, ఎస్సీ కార్పొరేషన్, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, జిల్లా వెనుకబడిన తరగతులు, జిల్లా మైనార్టీ కార్పొరేన్, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా అటవీ శాఖ తదితర శాఖలకు సంబంధించిన అనేక అంశాలపై జడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించడం జరిగిందని, సభ్యులు ప్రస్తావించిన సమస్యలన్నింటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. అదే విధంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వారు సమావేశంలో ప్రతిపాదించిన అంశాలను ఆమోదిస్తూ ఆ ప్రతిపాదనలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులందరూ సమర్ధవంతంగా పనిచేస్తున్నందున అనేక రకాల సమస్యలు పరిష్కారం పొందుతున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో అనేక సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న చుక్కల భూముల సమస్య పరిష్కారం కావడంతో పాటు రైతులకు భూ యాజమాన్య హక్కు కలగడంతో వారు ఎంతో సంతోషంగా ఉన్నారని మంత్రి వివరించారు. రానున్న రోజుల్లో మరింతగా జిల్లాను అభివృద్ధి పథంలో ముందంజలో నిలపేందుకు, జిల్లా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్దం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లా అభివృద్ధి, జిల్లా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతూ ఈ సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని, ప్రొటోకాల్ విషయంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అధికారులు ఖచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఉదయగిరి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి డయాలసిస్ యూనిట్ మంజూరు కావడం జరిగిందని, త్వరలో యూనిట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అజెండా అంశాలకు సంబంధించి సభ్యులు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు నోట్ చేసుకొని ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు ఆ వివరాలను సంబంధిత సభ్యలకు తెలియజేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాత్, తిరుపతి జిల్లా రెవెన్యూ అధికారి బి.కోదండరామిరెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు వెంకటరావు, సాంబశివారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

**నెల్లూరు ఆగస్టు 30, ప్రభాతవార్త-వైద్యం** ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం పెంచలయ్య సూచించారు. బుధవారం నగరంలోని సంతపేటలో ఉన్న డీఎంహెచ్ఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పెంచలయ్య అధ్యక్షతన కావలి, కందుకూరు, ఆత్మకూరు డివిజన్ల వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, సీనియర్ అసిస్టెంట్లతో ఆరోగ్యశ్రీ పథకంపై శిక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్పులకు ఆరోగ్యశ్రీ పథకం సద్వినియోగ పరుచుకుని మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ పథక ప్రాధాన్యతను గురించి ప్రజలకు తెలియచేసి, వారు ప్రభుత్వ ఆసుపత్రులకి వచ్చి కాన్పుని ఆరోగ్యశ్రీలో నమోదు చేసుకునేలా చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ చంద్రశేఖర్, ఆరోగ్యశ్రీ జేఈఓ డాక్టర్ సుజాత, డాక్టర్ ఖాదర్‌వలి, బి శ్రీనివాసరావు, ఆరోగ్యశ్రీ బృందం పాల్గొన్నారు.

# వక్‌బోర్డు ముత్తవల్లి ఎన్నిక నామినేషన్‌కు గడువు సెప్టెంబర్ 5



**నెల్లూరు టౌన్, ఆగస్టు30, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్‌బోర్డు సభ్యులుగా ముతవల్లి ఎన్నికకు గాను మైనారిటీ సంక్షేమశాఖ షెడ్యూల్ను విడుదల చేసిందని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారిని, జిల్లా అదనపు వక్ అధికారిని డాక్టర్ ఏ.నిర్మలాదేవి తెలిపారు. జిల్లా కేంద్రమైన నెల్లూరులోని తన కార్యాలయంలో బుధవారం రాత్రి మాట్లాడుతూ ఈ ఎన్నిక ప్రక్రియ సెప్టెంబర్ నెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరుగుతుందని ప్రకటించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా నుంచి అర్హులైన వారు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నిర్దేశించిన గడువులోపు నామినేషన్లు వేసుకోవాల్సిందిగా ఆమె సూచించారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఆసక్తి కలిగిన అర్హులైన వారి నుంచి నామినేషన్ స్వీకరిస్తామని పేర్కొన్నారు. తాడేపల్లిలోని ఎన్నికల అధికారి మైనారిటీ కమిషన్ వారి కార్యాలయంలో తన నామినేషన్లు అందజేయాల్సిన ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం 5గంటలకు ముగుస్తుందన్నారు. అదే రోజు సాయంత్రం 05:30గంటలకు నామినేషన్ల పరిశీలన ఉంటుందని, సెప్టెంబర్ 7న సాయంత్రంలోపు ఉపసంహరణ ఉంటుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 9న ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విజయవాడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న షా జాహూర్ ముసాఫిర్ ఖాన్‌లో ఎన్నికలు జరుగుతాయని ఆమె స్పష్టం చేశారు. అనంతరం ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత గెలుపొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని ఆమె చెప్పారు.

# చెస్ పోటీల్లో ఆదాని వరల్డ్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

**ముత్తుకూరు, ఆగస్టు30, ప్రభాతవార్త** ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో ఆదాని వరల్డ్ స్కూల్‌కు చెందిన విద్యార్థి పి.మిదిలేష్ చెస్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండవ బహుమతిని కైవశం చేసుకోవడం ఆనందంగా ఉందని ప్రిన్సిపల్ సిరియాల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రెండు రోజులు నిర్వహించిన ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో ఆదాని వరల్డ్ స్కూల్లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి 1500పైరేటెడ్ టోర్నమెంట్ పోటీల్లో మంచి ప్రతిభ చూపి రెండో బహుమతి సాధించడం జరిగిందని విద్యార్థికి తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ హైదరాబాద్‌లో షీల్డ్‌తో పాటు 9వేల రూపాయల నగదు బహుమతిని అందించారన్నారు. ఆదాని వరల్డ్ స్కూల్లో విద్యతో పాటు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. చెస్‌లో బహుమతి రావడం పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు.




# సచివాలయాలను తనిఖీ చేసిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, ఆగష్టు 30, ప్రభాతవార్త** నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 12/2 చింతారెడ్డిపాలెం, 12/3 వావిలేటిపాడు వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని ఇన్‌స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిష్టరు, స్పందన రిజిష్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. సచివాలయం పరిధిలో నిర్ధేశించిన కార్యక్రమాల్లో ఎలాంటి పెండింగ్‌లు ఉంచరాదని కమీషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను కమీషనర్ ఆదేశించారు. సచివాలయాల పరిధిలోని ప్రజలకు స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందిస్తున్న ఉచిత వైద్యం, మందుల పంపిణీ, రక్త పరీక్షలు తదితర సేవలపై అవగాహన కల్పించాలని కమీషనర్ సూచించారు. సచివాలయాలలో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోగా పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని కార్యదర్శులకు కమీషనర్ సూచించారు. ఎస్‌డీజీ సర్వే, భూ హక్కు సర్వే, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సూచించిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని తెలిపారు. జగనన్న కాలనీ లేఅవుట్ల నిర్మాణం పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆమెనిటీస్ కార్యదర్శులను కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అదనపు కమీషనర్ శర్మద, మండల ఎడ్యుకేషన్ అధికారి మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా రక్షాబంధన్



**కోవూరు , ఆగస్టు30 ప్రభాతవార్త :** కోవూరులోని కేవీఎస్ కళ్యాణ మండపం ప్రాంగణంలో బుధవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా రక్షాబంధన్ కార్యక్రమం వైభవంగా కొనసాగింది. కోవూరు నియోజకవర్గానికి సంబంధించిన పలువురు టీడీపీ మహిళా నాయకులు కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి రాఖీ కట్టి తమ అనుబంధాన్ని ఆప్యాయతను పంచుకున్నారు. ఈ సందర్భంగా దినేష్‌రెడ్డి మాట్లాడుతూ తనకు రాఖీ కట్టిన అక్క చెల్లెమ్మల కుటుంబాలు సంతోషంగా ఉండాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నానన్నారు. నియోజకవర్గంలోని అక్క చెల్లెమ్మల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు స్వర్ణలత మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో దినేష్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఈ సందర్భంగా దీక్ష పూనడం జరిగిందన్నారు. అనంతరం మహిళలు పోటీలు పడి దినేష్‌రెడ్డికి రాఖీలు కట్టి హారతులు ఇచ్చి తమ సంతోషాన్ని ఆయనతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణమ్మ, పలువురు మహిళా నేతలు ఉన్నారు.

## బడి బయట ఉన్న పిల్లలతో ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు , ఆగస్టు30 ప్రభాతవార్త :** బడి ఈడు కలిగి చదవకుండా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. కోవూరు లోని ఎంపీడీవో కార్యాలయంలో బుధ`వారం ఆయన మండల విద్యాశాఖ అధికారి రహీమ్‌తో కలిసి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు వారి వారి పరిధిలో ఉన్న 50 కుటుంబాల్లో బడి ఈడు కలిగి బడి ఉన్న వారిని గుర్తించి వెంటనే ఆ సమాచారాన్ని తెలియజేయాలన్నారు. సీఆర్‌పీలు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించి ఈ వారంలోగా నూరుశాతం బడిలో ఉండేలా దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీ మహేష్, సీఆర్‌పీలు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి క్యారమ్స్, చెస్ పోటీలకు కోదండరామయ్య ఎంపిక




**కోవూరు , ఆగస్టు30 ప్రభాతవార్త :** కోవూరు మండలం నేతాజీ నగర్ ప్రాథమిక పాఠశాల ఉపా ధ్యాయుడిగా పనిచేస్తున్న జి. కోదండరామయ్య ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ జిల్లా స్థాయి సెలక్షన్‌లో పాల్గొని క్యారమ్స్, చెస్ పోటీల్లో అద్వితీయమైన ప్రదర్శన చేపట్టిర ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు రెండు ఆటల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజయ వాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సెప్టెంబర్ 8,9 తేదీల్లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో కోదండరామయ్య పాల్గొంటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కోదండరామయ్యను సహచర ఉపాధ్యాయులు, మిత్రులు ప్రత్యేకంగా అభినందించారు.

## పేదరికం నిర్మూలనే ధ్యేయంగా ఈ పాదయాత్ర


**కోవూరు , ఆగస్టు30 ప్రభాతవార్త :** పేదరికం నుంచి పేద జన విముక్తే ధ్యేయంగా ఐకమత్యమై ఒక లక్ష్యంగా నిర్ణయించుకుని ఒక పవిత్రమైన ఆశయంతో ఈ ఐక్యత విజయ పథం యాత్రకు శ్రీకారం చుట్టడం జరిగిందని మాజీ ప్రభుత్వ కార్యదర్శి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ అన్నారు. కోవూరులోని ప్రధాన రహదారిలో ఐక్యతా విజయపథం యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల్లో ఉన్న నాయకత్వ లక్షణాలు గుర్తించి వారిలో చైతన్యం తెచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 425 కిలోమీటర్లు పాదయాత్ర చేయడం జరిగిందన్నారు. ఇప్పటికి అనేక ప్రాంతాల్లో గిరిజన కుటుంబాల్లో దుర్భరమైన జీవితాన్ని గడుపుతూనే ఉన్నారన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు దాటినా ఇంకా మూడు పూటలా తిండి దొరక్క ఇటువంటి వారు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. తింటానికి తిండి లేక, సరైన దుస్తులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. అటువంటి వారి సమస్యలను పూర్తిగా అధ్యయనం చేసేందుకే ఈ పాదయాత్రను ప్రారంభించడం జరిగిందన్నారు. ఇంకా అనేకమంది అనగారిన వర్గాలు ఆశించిన మేర సహాయం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేవలం ధనసాయం చేస్తే వారి బతుకులు మారవని, వారికి ఉపాధి కల్పించేలా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యావంతులైన నిరుద్యోగ యువతకు స్థిరమైన ఉపాధి కల్పించడమే ఈ ఐక్యతా విజయపథం యాత్ర యొక్క ప్రధాన ఉద్దేశయన్నారు. ఈ సంద ర్భంగా ఆయనను కోవూరుకు చెందిన అనేకమంది నేతలు శాలువా, పూలమాలతో సత్కరించి సన్మానం చేశా రు. ఈ కార్యక్రమంలో విజయశ్రీ, గిరిబాబు, నిడిగుంట అరుణ, మస్తానయ్య, బుజ్జయ్య, తదితరులు ఉన్నారు.

## కృత్యంతర బోధనపై దృష్టి పెట్టాలి



**కోవూరు , ఆగస్టు30 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు ప్రాథమిక దశ నుంచి విద్యార్థులకు ఆటా, పాటలతో కూడిన చదువుపై దృష్టి పెట్టాలని ఎంఈవో రహీమ్ అన్నారు. కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత సమావేశం మందిరంలో కోవూరు బుచ్చి మండలానికి సంబంధించిన ఉపాధ్యాయులకు పలు అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా దృష్టి పెట్టాలన్నారు. అన్ని పాఠశాలల్లో ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చి దిద్దేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, రిసోర్స్ పర్సన్‌లు ఉన్నారు.

## ప్రతి ఇంటికి సంక్షేమపథకాలు



**సైదాపురం ఆగష్టు 30 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమపథకాలు అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మరలపూడి సచివాలయం పరిధిలో గడగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో బుధవారం ఆయన పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళుతు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలు లబ్దిదారులకు వివరించి బుక్‌లేట్ అందించారు. అలాగే ప్రజల సమస్యలు తెలుసుకొని తక్షణ పరిష్కారం కొరకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలు అర్హులైన వారు పొందేందుకు గ్రామాలలో సచివాలయ వ్యవస్థను తీసుకొని వచ్చి ప్రతి పేదవారికి అనేక పథకాలను ముఖ్యమంత్రి అందిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ మీసాల వెంకటేశ్వర్లు, తహసిల్దారు శ్రీనివాసులు, వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు వరదబండి ప్రభాకర్‌రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసరాజు, నాయకులు అభిరాజు, సుబ్బారెడ్డి, వివేక్‌రెడ్డి, నాయకులు పాల్గోన్నారు.

## పోలీస్‌స్టేషన్ పరిశీలించిన సిఐ సుబ్రమణ్యం



**సైదాపురం ఆగష్టు 30 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సైదాపురంలోని పోలీస్‌స్టేషన్‌ను రాపూరు సిఐ సుబ్రమణ్యం సాధారణ తనీఖి లలో భాగంగా బుదరవారం పరిశీలి ంచారు. ఈ సందర్బంగా పలు రికార్డులను తనీకి చేసి వివిధ కేసులకు సంబందించి సైదాపురం ఎస్ఐ చల్లా వాసును అడిగి వివ రాలు తెలుసు కున్నారు. అనంతరం స్టేషన్ పరి సరాలను సం దర్శించారు. ఆయన వెంటహెడ్ కానిస్టేబుల్ గణేష్, నారయ్య, తదిత రులున్నారు.

## గిరిజన పిల్లలకు భోజన పొట్లాలు పంపిణీ



**కావలి రూరల్, ఆగష్టు 30 ప్రభాతవార్త:** నెల్లూరు నగరానికి చెందిన వై. రాజేష్‌కుమార్‌రెడ్డి, గీతా దంపతుల కుమార్తె చిన్నారి వై. పూజ్యశ్రీరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో బుధవారం కావలి సమీపంలోని బుడమగుంట గిరిజన ప్రాంతంలో వున్న పిల్లలకు భోజన పొట్లాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర మాట్లాడారు. తమ సంస్థ ద్వారా పేద పిల్లలకు భోజనం ఏర్పాటు చేసిన దాతలు వై. రాజేష్‌కుమార్‌రెడ్డి, గీతా దంపతులకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఈ రోజు పుట్టిన రోజు జరుపుకుంటున్న పూజ్యశ్రీరెడ్డికి సంస్థ తరపున పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవుల తోటయ్య మృతి



**కావలి రూరల్, ఆగష్టు 30 ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం పెద్దపట్టపుపాళెం గ్రామానికి చెందిన ఆవుల తోటయ్య(42) విద్యుత్ షాక్‌తో బుధవారం మృతి చెందాడు. మృతుడు భార్య ఆవుల విజయమ్మ కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. మృతుడి భార్య కథనం మేరకు వివరాలు ఇలావున్నాయి. ఆవుట తోటయ్య సముద్రంలో చేపల వేటకు వెళ్లే వాడు. బుధవారం ఉదయం తన పొలంలో మోటారుకు కరెంటు సరఫరా అవుతుండటంతో పక్కనే వున్న ట్రాన్స్‌ఫార్మర్ ఆపేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై తోటయ్య అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు.

మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

## పాఠశాలను తనీఖి చేసిన ఎంఇఒ



**బుచ్చి ఆగష్టు 30 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు గ్రామంలో మెయిన్ పాఠశాలను ఎంఇఒ దిలీప్‌కుమార్ ఆఖస్మికంగా తనీఖి చేశారు. ఈ సందర్బంగా ఆయన రికార్డులు పరిశీలించారు. కొద్దిసేపు విద్యార్దులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులకు పలుసూచనలు అందజేశారు. ఈకార్యక్రమంలో విద్యార్దులు, ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

## మోదీ చిత్రపటానికి పలాభిషేకం



**నెల్లూరు ఆగష్టు 30, ప్రభాతవార్త-వైద్యం:** రక్షాబంధన్ పండుగ సందర్బంగా రాష్ట్రంలోని అక్కాచెల్లెమ్మల కళ్ళలో ఆనందం చూడాలనే ఆలోచనతో వంటగ్యాస్‌పై రెండు వందల రూపాయలు ప్రధాని నరేంద్రమోదీ తగ్గించిన శుభసందర్భంలో భారతీయ జనతా పార్టీ యువమోర్చా నెల్లూరు జిల్లా అధ్యక్షుడు గుత్తా అశోక్‌నాయుడు ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని విఆర్సీ కూడలిలో నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంపిణీ చేసి హర్షం వ్యక్తంచేశారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు తాళ్ళూరు నవీన్‌కుమార్, మురుగా నరేష్, ఉపాధ్యక్షుడు మదన్‌సాయిరెడ్డి, సాయికృష్ణ, హరిప్రసాద్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు విష్ణుతేజరెడ్డి, సాంబిశివరెడ్డి, కార్యదర్శులు తిరుపతి, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కోవూరు బాలికల పాఠశాలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు

**కోవూరు , ఆగస్టు30 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు 2022-23 విద్యాసంవత్సరానికి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు లభించింది. ఈ మేరకు బుధవారం పాఠశాలలో ప్రత్యేక అభినందనల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేలా ఫిజికల్ డైరెక్టర్ దేవిక, పీఈటీ వెంకటసుబ్బమ్మలు ప్రత్యేకంగా కృషి చేశారన్నారు. బాక్సింగ్ పోటీలో రాష్ట్రస్థాయిలో ఈ పాఠశాల విద్యార్థులు 20 పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మెమెంటోలను షీల్డ్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసిల్దారు



**సంగం ఆగష్టు 30 ప్రభాతవార్త:** మండలకేంద్రమైన సంగంలోని జడ్‌పి హై స్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను తహసిల్దారు నాగరాజు పరిశీలించారు. హైస్కూల్‌లో తరగతి గదులు, డిజిటల్ క్లాస్ రూంలు పరిశీలించారు. అనంత రం మధ్యాహ్న బోజనం తనీకి చేసి వారికి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## ప్రతి ఇంటిలో సమస్యలు: కోవూరు టీడీపీ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి



**కోవూరు , ఆగస్టు30 ప్రభాతవార్త :** వైసీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు దాటినా అన్ని ప్రాంతాల్లో సమస్యలు ఉన్నాయే తప్ప వాటిని పరిష్కరించే నాధుడే కరువయ్యారని కోవూరు టీడీపీ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని పెళ్లకూరు కాలనీ ప్రాంతంలో ప్రతి అడుగు గడపకోసం కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలనీ ప్రాంతంలో ప్రతి ఇంటిలో అనేక సమస్యలు ఉన్నాయని, గెలిచిన వార్డు మెండర్లు, సర్పంచ్‌లు తమను పట్టించుకున్న దాఖలాలు లేవని అనేకమంది అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వ పాలనలో గరిజనులకు ఆశించిన మేర నామినేటెడ్ పోస్టుల్లో ప్రతినిధ్యాలు వహించడం లేదన్నారు. ఇందుకు ఉదాహరణ కోవూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా ఓ గిరిజన మహిళను ప్రభుత్వం నియమిస్తే వారం రోజులు తిరగకముందే ఆమె ఆరోగ్యం బాగాలేదని రాజీనామా చేసి ఉపాధ్యక్షుడిగా ఉన్న పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి ఏఎంసీ చైర్మన్‌గా వ్యవహరిస్తూ గిరిజనులకు ఆ పదవి ఇవ్వకుండా గత రెండు సంవత్సరాలుగా నెట్టుకొస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి గిరిజన మహిళలనే ఏఎంసీ చైర్మన్‌గా చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కేవలం ఈ ప్రభుత్వం గిరిజన సంక్షేమం మాటల్లో తప్ప చేతల్లో లేదన్నారు. తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొడవలూరు మండలంలో గిరిజన బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా తెలుగుదేశం పాలనలోనే గిరిజన సంక్షేమానికి కట్టుబడి అనేక పథకాలు వారి కొరకు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఎంతసేపటికి చంద్రబాబు నాయుడినే విమర్శించడం తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవన్నారు. ఈ సందర్భంగా పెళ్లకూరు కాలనీలో గడపగడపకు వెళ్లి చంద్రబాబు అమలు చేస్తున్న మహాశక్తి మేనిఫెస్టోను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, అమరేంద్రరెడ్డి, వీరేంద్ర, మాజీ ఎంపీపీలు వెంకటరమణమ్మ, శ్రీకర్‌రెడ్డి, నేతలు బాలరవి, నాటకరాణి వెంకట్, కృష్ణచైతన్య, హరి, గోవిందు, శ్యామ్, శ్యామ్ సుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లికార్జున, దాసరి మురళి, దారా విజయ్‌బాబు, జాన్సన్, సన్నపరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, రాము, వెంకటేశ్వర్లుమస్తానయ్య, మహేష్, సాధిక్, సుధాకర్, , పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## డాక్యుమెంట్ రైటర్స్, వెండర్స్ పోరాటానికి తమ మద్దతు



**కావలి, ఆగస్టు 30 ప్రభాతవార్త:** సమస్యల పరిష్కారానికి డాక్యుమెంట్ రైటర్స్, వెండర్స్ చేస్తున్న పోరాటానికి తమ పార్టీ మద్దతు వుంటుందని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా డాక్యుమెంట్ రైటర్స్, వెండర్స్ నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని బుధవారం మాలేపాటి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడారు. లక్షలాది మంది జీవితాలతో ఆటలాడుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చివరి దశలో వున్నారని దుయ్యబట్టారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మీ వృత్తికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు. మీరు చేసే పోరాటాలకు అండగా వుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్, వెండర్స్, టిడిపి నేతలు మన్నవ రవిచంద్ర, కుందుర్తి కిరణ్, తదితర టిడిపి నేతలు పాల్గొన్నారు.

## భవిత కేంద్రంలో రక్షాబంధన్ వేడుకలు



**కావలి రూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త:** కావలి తుమ్మలపెంట రోడ్డులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో సక్షం ఆధ్వర్యంలో బుధవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కావలి ఆర్టీసి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు ముఖ్యఅతిధిగా పాల్గొని 5 వేల రూపాయలు విలువ చేసే ఆట వస్తువులు కేంద్రానికి బహుకరించడంతో పాటు కేంద్రంలో శిక్షణ పొందుతున్న బాలలకు రక్షలు కట్టి మిఠాయిలు పంపిణీ చేసి మాట్లాడారు. శారీరక, మానసిక దివ్యాంగుల భవితకు భరోసా కల్పిస్తూ అండగా నిలుస్తామని సంకల్పిస్తూ రాఖీలు కట్టాలని పిలుపునిచ్చారు. సమాజంలో అన్ని వర్గాల వారితో సహా దివ్యాంగులు కూడా అభివృద్ధి చెందడానికి కృషి చేయాలన్నారు. సక్షం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ దేశంలో మూడు కోట్ల మంది 12 రకాల అంగవైకల్యం కల్గిన దివ్యాంగుల సమగ్రాభివృద్ధికి సక్షం కృషి చేస్తుందన్నారు. సక్షం కావలి శాఖ బాధ్యులు మంగళగిరి వేణుగోపాలరావు, నాగమణిలు మాట్లాడుతూ భవిత కేంద్రాలలో శిక్షణ పొందుతున్న బాలలకు అండగా వుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దినేష్, మోహన్‌రెడ్డి, రొటేరియన్లు గోపికృష్ణ, సలీంబేగ్, సదరం ఉద్యోగి భాస్కరరావు, సక్షం అల్లూరు మండల కన్వీనర్ రమణయ్య, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## 'సానం' వివాహ వేడుకలకు హాజరైన మేకపాటి



**వింజమూరు, ఆగస్ట్30, ప్రభాతవార్త:** వింజమూరు మండలం శంఖవరం గ్రామానికి చెందిన సానం గంగిరెడ్డి-జయలక్ష్మిల కుమార్తె నాగవేణి వివాహానికి ఉదయగిరి వైసిపి ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. మేకపాటి తమ గ్రామానికి మొదటగా వస్తున్న సందర్భంగా సర్పంచ్ భోగిరెడ్డి మల్లీశ్వరి, భోగిరెడ్డి ఓబులురెడ్డిలు స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సన్మానించి ఆహ్వానించారు. స్థానిక నాయకులతో వివాహానికి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, మాజీ మండల కన్వీనర్ గువ్వల కృష్ణారెడ్డి, నాయకులు లింగాల దిన్నె రవీంద్రరెడ్డి, భక్తవత్సలరెడ్డి, ఉప సర్పంచ్ తాటిబోయిన మాల్యాద్రి, చింతనబోయిన ప్రకాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరిక్షలు



**వింజమూరు, ఆగస్ట్30, ప్రభాతవార్త:** వింజమూరులోని బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులకు బుధవారం హిమోగ్లోబిన్ పరిక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పి విజయలక్ష్మి విద్యార్థుల రక్తనమూనాలను సేకరించి హిమోగ్లోబిన్ పరిక్షలు నిర్వహించారు . హిమోగ్లోబిన్ శాతం తక్కువ గా ఉన్న విద్యార్థుల గురించి ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎఎన్ఎం పి.గ్లోరీ, షాకీరా, ఆశవాలంటీర్ నూర్జహాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.మాలకొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బత్తినవారిపల్లిలో పశువిజ్ఞానబడి



**వింజమూరు, ఆగస్ట్30, ప్రభాతవార్త:** వింజజమూరు మండలం చాకలికొండ పంచాయతీ పరిధిలోని బత్తినవారిపల్లి గ్రామంలో గ్రామ సచివాలయం లో పాడి పశుపోషకులకు పశువిజ్ఞాన బడిని చాకలికొండ పశువైద్యాధికారి డాక్టర్ కొమ్మి కోటేశ్వరరావ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో ఉచితంగా పశువులకు గొంతువాపు టీకాలను వేశారు. పశుగడ్డిపెంపకం, పశుదాణా గురించి వివరించారు. ఈకార్యక్రమంలో పశువైద్య సహాయకులు మహేష్, పశుపోషకులు పాల్గొన్నారు.

## చెడువ్యసనాలకు గురికావద్దు

**కలిగిరి, ఆగష్టు30, ప్రభాతవార్త;** చెడువ్యసనాలకు బలికావద్దు. మిమ్మలకన్న లత్తిదండ్రులకు తలవంపులు తెవద్దని కలిగిరి యస్ఐ సూర్య ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మారకద్రవ్యాల వ్యసనాలపై బుదవారంకలిగిరిలోని జడ్‌పి హైస్కూల్ నందు కలిగిరి పోలీసులు విద్యార్డులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా యస్ఐ విధ్యార్డులను ఉద్దేశించి మాట్లాడుతూ విధ్యార్ది దశ కీలకమైనదన్నారు. విధ్యార్డులకు చక్కగా చదువుపై శ్రద్ధ వహించి పోటీపరీక్షల్లో మంచి మార్కులు సాదించాలన్నారు. తద్వారా ఉన్నత చదువులు చదివి మీ భవిష్యత్‌కి బంగారు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. మీ వయస్సు పెరిగేకొంది చదువుల్లో ఉన్నత శికరాలు చూడాడాలే తప్ప పక్క చూపులు చూస్తే మీభవిష్యత్ అందకారమౌతుందన్నారు. చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ ఇతరులకు మార్గదర్శగా నిలబడి సమాజానికి ,మీకన్న తల్లింద్రులకు, చదువు చెప్పిన ఉపాద్యాయులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. మన ప్రభుత్వం కల్పించి అనేకవసతులను ప్రతి విద్యార్ది సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యస్‌సిబి యస్ఐ అశోక్‌కుమార్ ఆద్వర్యంలో జరిగిన ఈసమావేశంలో పోలీసులు, పాఠవాల ఉపాద్యాయులు పాల్గొన్నారు.

## సిద్దవరం కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయ శిక్షణ



**సిద్దవరం(రాపూరు), ఆగష్టు30ప్రభాతవార్త:** మండలంలోని సిద్దవరం గ్రామంలోని ఎంపీపి ఎస్ పాఠశాలలో బుదవారం రాపూరు, సిద్దవరం కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు ఒక్కరోజు వృత్తంతర శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కాంప్లెక్ట్ ఇన్‌చార్జ్ పి. హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్ పఠాన్ అల్లాబక్షు హాజరై ఉపాధ్యాయులకు బోధనలోని మెలుకువులను చక్కగా తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు బోధన ఉపకరణాలను చక్కగా తయారు చేసి ప్రదర్శించారు.

## వాకాటిని సన్మానించిన పోట్లూరి



**నెల్లూరు ఆగస్టు 30, ప్రభాత ˇవార్త-వైద్యం:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా వాకాటి నారాయణరెడ్డి నియమితులైన సందర్భంగా బుధవారం పొదల కూరు రోడ్డులో ఉన్న ఆయన నివాసంలో భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోట్లూరి శ్రీనివాసులు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు చచ్చాల ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఏలూరు బుజ్జయ్య, కార్యదర్శి శరవణలు నారాయణరెడ్డిని శాలువా కప్పి, పుష్పగుచ్ఛాన్ని సత్కరించారు.

## పాదయాత్ర విజయవంతం కావాలని మహిళల ప్రత్యేక పూజలు



**నెల్లూరు ఆగస్టు 30, ప్రభాతవార్త-వైద్యం:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా పూర్తి కావాలని తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు బుధవారం నగరంలోని 18వ డివిజనులోని శివాలయంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాఖీ పండుగ సందర్భంగా నెల్లూరు రూరల్ టీడీపీ మహిళలు రాఖీలకు పూజలు చేసి నారా లోకేష్ పాదయాత్ర వద్దకు రాఖీలను పంపించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబిర్‌ఖాన్, సుధాకర్‌రెడ్డి, ఉప్పాల వెంకటేశ్వర్లు, నాగరాజు, శివకుమార్, టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, వనజారెడ్డి, చేజర్ల కవిత, పి అరుణ, ఏ లక్ష్మి, శాంతి, బుజ్జమ్మ, విజయలక్ష్మి, కోటేశ్వరి, పద్మావతి, కరీమా, సుభాని, పర్వీన్, బుజ్జి, మొబీనా, నెల్లూరు బుజ్జమ్మ, సుగుణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూలీల సంఖ్యను పెంచండి

**వరికుంటపాడు, ఆగష్టు 30, ప్రభాతవార్త :** జాతీయఉపాధిహామి పథకం లో పని చేసే కూలీల సంఖ్యను మరింత పెంచాలనీ, జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలనీ ఎంపిడిఓ చేవూరి.శ్రీదేవి అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో బుధవారం ఉపాధి హామి సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి వంద రోజుల పని దినాలు కల్పించాలనీ ,ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు తప్పనీసరిగా పని కల్పించి వలసలను నివారించాలన్నారు. ఆధార్ సీడింగ్ ప్రక్రియను త్వరితిగతిన పూర్తి చేయాలనీ ,నవరత్నాలలో భాగంగా గృహా నిర్మాణాలకు సంబందించి మస్టర్ లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలనీ ఎంపిడిఓ చేవూరి.శ్రీదేవి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమములో ఈసీ బి. హజరత్ నాయక్ టి.ఎ లు మూర్తి, మల్లికార్జున. సిఓ నాగేశ్వరరావు ,ఫీల్డ్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

## దస్తావేజల రైటర్ల పెన్‌డౌన్



**బుచ్చి ఆగష్టు 30 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెంలోని దస్తావేజుల రైటర్లు బుదవారం పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దస్తావేజుల రైటర్ల యూనియన్ సభ్యులు ఎం.వి శేషయ్య మాట్లాడుతు అనాధిగా రిజిష్టార్ కార్యాలయం నమ్ముకొని జీవిస్తున్నామని ఆయన తెలిపారు. మా పూర్వికులు కూడా ఇదే కార్యక్రమంలో ఉంటు ఉండే వారని వారు తెలిపారు. ప్రభుత్వం లైసెన్స్‌లు కూడా అప్పటి ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. అయితే ప్రభుత్వం కొత్త సాఫ్ట్‌వేర్ 2.0 ని తీసుకొని వచ్చి మా వ్యవస్థను నిర్వీర్యం చేయాలని ప్రభుత్వం చూస్తుందని వారు నిరసన వ్యక్తం చేశారు. దస్తావేజల రైటర్లు ప్రభుత్వానికి కోట్ల రూపాయాలు ఆదాయం చేకూరుస్తున్నామని తెలిపారు. ప్రజల ఆస్తులు కాపాడుతు, ప్రభుత్వ నిబంధనలు ఎప్పటికప్పుడు తెలిజేస్తు ప్రభుత్వానికి ప్రజలకు వారదిగా ఉన్నామని వారు తెలిపారు. ప్రభుత్వం స్పందించి 2.0 లాంటి సాఫ్ట్‌వేర్లు వెనుకకు తీసుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో దస్తావేజుల రైటర్లు పాల్గోన్నారు.

## జవహర్ భారతిలో విద్యార్థులకు గేమ్స్ పోటీలు



**కావలి రూరల్, ఆగస్టు 30 ప్రభాతవార్త:** విశ్వోదయ స్థాపకులు డిఆర్ పేరు మీద విశ్వోదయ డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ డిఆర్ బాలల దినోత్సవం 2023 రెండో రోజు బుధవారం కావలి జవహర్ భారతి కళాశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో విద్యార్థులు హోరాహోరీగా తలపడ్డారు. కావలి నియోజకర్గ పరిధిలోని కావలి, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాలకు చెందిన 50 పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మాల్యాద్రి, పిడి ప్రసాద్‌రెడ్డిల పర్యవేక్షణలో జరిగాయి.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



**దుత్తలూరు(వరికుంటపాడు), ఆగష్టు 30, ప్రభాతవార్త :** మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై కఠిన చర్యలు తప్పవనీ దుత్తలూరు ఎస్సై ప్రభాకర్ అన్నారు. జాతీయ రహదారిపై దుత్తలూరు ఎఎ కాలనీ సమీపంలో బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రభాకర్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదనీ, తప్పని సరిగా హెల్మెంట్ లను ధరించాలనీ, వాహనాలకు సంబందించిన ప్రతాలను ,లైసెన్స్ కలిగివుండాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకు ంటామన్నారు. ఈ కార్యక్రమములో సిబ్బంది కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులకు ఘన సత్కారం

**చేజర్ల, ఆగస్ట్30, ప్రభాతవార్త:** చేజర్ల మండలం బిల్లుపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన ముగ్గురు విద్యార్థులను బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. మాదాల రవిబాబు అనే ఉపాధ్యాయుడు ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా చేరిన తర్వాత సంవత్సరంలో 1వ తరగతిలో చేరిన విద్యార్థులు 7వ తరగతి వరకు అదే పాఠశాలలో చదివారు. అప్పటి ఉపాధ్యాయుల కృషి పట్టుదలతో ఇప్పుడు ఇంటర్ అయిన తర్వాత వారి ప్రతిభను గమనించిన ఉపాధ్యాయుడు వారిని పాఠశాలకు ఆహా ్వనించి సన్మానించారు. గ్రామ చరిత్రలో మొదటిసారిగా మెడిసిన్ సీటు మా విద్యార్థి సాధించడం చాలా ఆనందకరమన్నారు. ఐతా అశోక్ ఎంబిబిఎస్ సీటు, గొర్ల చక్రవర్తి విట్‌భోపాల్, మహేష్ ఇంజనీరింగ్‌లో చేరిన సందర్భంగా మిగతా విద్యార్థులకు ప్రోత్సాహంగా ఉండేందుకు ఆ ముగ్గురు విద్యార్థులను సన్మానించినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రస్తుతం పనిచేసిన ఉపాధ్యాయుల సమక్షంలో వారిని అభినందించారు.

## జనసేన ఆధ్వర్యంలో రాఖీ పండుగ వేడుకలు



**నెల్లూరు, ఆగస్టు30 ప్రభాతవార్త-విద్య:** రక్షా బందన్‌ను పురస్కరించుకుని బుధవారం జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌కు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిని, రీజినల్ కోఆర్డినేటర్‌కోలా విజయలక్ష్మీ, నగర వీర మహిళలు రేణుకా, హైమావతి, రేవతిలు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గునుకుల కిషోర్ మాట్లాడుతు జిల్లా వాసులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవడమే పార్టీ అందరి కర్తవ్యమని, ఆడపడుచుల ప్రధాన కోరికన్నారు. ఇందుకోసం అందరూ కలిసి శ్రమించాలని కోరారు. అలాగే రాఖీ పర ్వదినాన్ని పురస్కరించుకుని తనకు రాఖీ కట్టి ఆశీర్వదించిన ఆడపడుచుల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని, వారి అభిమానాన్ని మరువలేమన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రశాంత్, వంశీ, కాంతర్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## 99 వేల గడపలు పూర్తి చేసి 99 కేజిల కేకుకటింగ్





**బుచ్చి ఆగస్టు 30 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలం పంచేడు గ్రామంలో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 99 వేల గడపలు పూర్తి చేసిన సందర్భంగా వైసిపి నాయకులు సూరా శ్రీనివాసులురెడ్డి,జడ్‌పిటిసి మెంబర్ సూరాప్రదీప 99 కేజిల కేకును కట్ చేసి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతం కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి నాయకులందరు కేకుని తినిపించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు గత సంవత్సరం ఆగష్టు 1 వ తేది జొన్నవాడలో మల్లికార్జునస్వామి,కామాక్షితాయి ఆశీర్వాదంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని, ఎంతో విజయవంతంగా పూర్తి చేశామని ఆయన తెలిపారు. వరుణుదేవుడి కరుణకూడా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో చైర్‌పర్సన్,కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు,అధికారులు, పోలీసులు, విలేఖర్ల అందరు తమ వంతు సహాయసహాకారాలు అందించారని వారందరికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అన్ని రకాల పేద ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడం జరిగిందని, ఎన్‌ఎస్‌ఆర్ ట్రస్టు ద్వారా ప్రజలకు నావంతు సహాయ సహాకారాలు అందించినట్లు ఆయన స్పష్టం చేశారు.భారతదేశ చరిత్రలో ఏముఖ్యమంత్రి ఇటువంటి కార్యక్రమం చేయలేదని ఇది ఒక అద్బుతమైన కార్యక్రమం అని ఆయన తెలిపారు. గడగడపకు ఎమ్మెల్యే వెళ్లి ప్రజల కష్ట,సుఖాలు తెలుసుకోవడం అనే కార్యక్రమం ఇదే మొదటి సారి అని అన్నారు. ప్రజలు విశేషంగా ఆదరణ చూపుతున్నారని మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు.ఒక్కొక్క సచివాలయానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 20 లక్షలు రూపాయాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. పంచేడు గ్రామంలో ప్రజలు ఎమ్మెల్యేకి పూలతో ఘన స్వాగతం పలికారు. పంచేడు గ్రామానికి సంక్షేమపధకాల కింద 7 కోట్ల రూపాయాలు మంజూరు కావడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమపథకాలకు 2 లక్షల కోట్లు ఇప్పటి వరకు ప్రజలకు ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

**వర్షాన్ని సైతం లెక్క చేయని నాయకులు**

కేకును కట్‌చేసిన మరుక్షణం జోరు వాన కురిసింది. నాయకులు,కార్యకర్తలు అధికారులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కార్యక్రమంలో పాల్గోన్నారు.ఈకార్యక్రమంలో నియోజకవర్గం యువజన అద్యక్షులు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి,నల్లపరెడ్డి రాహిణ్‌రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, వైస్ చైర్మన్ షేక్,షాహుల్,కౌన్సిలర్లు షేక్ షకిలాబేగం, డాక్టర్ అల్లాబక్షు,మోర్ల భరత్ ,మోర్ల జయంతి, రేబాల మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి,కౌన్సిలర్ అందె ప్రత్యూషా, కంతా అనంతమ్మ, జొన్నవాడ నాయకులు మురళీ,సాగర్,చెల్లాయపాళెం మురళీ,కౌన్సిలర్ బెల్లం మల్లారెడ్డి,పెనుబల్లి సర్పంచ్ ఓడా పెంచలయ్య, కోవూరు మార్కెటింగ్ డైరక్టర్ జొన్నవాడ ప్రసాద్,చిరమణ సురేష్, నాగసుబ్బారెడ్డి,కో ఆప్షన్ మెంబర్లు చిన్నాల్లాబక్షు, పఠాన్ మహబూభాషా,సిఐ రామారావు,ఎస్ఐ వీరప్రతాప్, ఎంపిఎం కోటంరెడ్డి లలితారెడ్డి,పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

## కొండబిట్రగుంట దేవస్థానంలో తాగునీటి ఎద్దడి




**బిట్రగుంట, ఆగస్టు 30 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థాన సన్నిధిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా వుందని భక్తులు ఆవేదన చెందుతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మినీ వాటర్‌ప్లాంట్ పనిచేయకపోవడంతో కొళాయిలలో చుక్కనీరు రాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం పెళ్ళిళ్ళ సీజన్ కావడంతో శుభకార్యాలకు హాజరయ్యే వారు తాగునీరు లేక సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఆలయ కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణను వివరణ కోరగా దాతలు ఏర్పాటు చేసిన మినీ వాటర్‌ప్లాంట్ గత కొన్ని నెలలుగా పనిచేయడంలేదని దీని గురించి వారికి తెలియపరిచామని త్వరలో మరమ్మతులు చేయించి తాగునీటి ఎద్దడిని పరిష్కరిస్తామని తెలిపారు. అయితే శనివారం జరిగే అన్నదానానికి మాత్రం బయట నుంచి వాటర్‌క్యాన్లు తెప్పించుకొని భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాగునీటిని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## నెల్లూరులో కృష్ణాష్టమి వేడుకలు 6నుండి



**ఆత్మకూరు,ఆగస్ట్30,ప్రభాతవార్త:** నెల్లూరు పట్టణంలోని ఎన్‌టిఆర్ నగర్‌లో ని స్రవంతి స్కూల్ పరిసరాల్లో సెప్టెంబర్ 6నుండి12వ తేదీవరకు కృష్ణాష్టమి వేడుకలు జరుగుతాయని త్రైతసిద్ధాంత ప్రభోద సేవా సమితి హిందూ జనవేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షులు డి.సూరమౌళి తెలిపారు. ఈసందర్భంగా 12వతేదీ భారీ ఊరేగింపు జరుగుతుందనా న్నరు. ఇందుకు సంబంధించి ఆహ్వాన పత్రాన్ని దర్గామిట్టలోని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి కాంప్‌కార్యాలయంలో ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సభ్యులు కె.వి.రత్నం, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విద్యాగణపతి విగ్రహ ప్రతిష్ట



**కావలి, ఆగస్టు 30 ప్రభాతవార్త** కావలి పట్టణం కచ్చేరిమిట్టలో వేంచేసి వున్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం విద్యాగణపతి విగ్రహ ప్రతిష్ట ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు అన్నవరం వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి హోమాలు చేశారు. విగ్రహ ప్రతిష్ట వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తిరివీధి ప్రసాద్ మాట్లాడారు. పాలు, పెరుగు, నెయ్యితో ఎంతో పవిత్రంగా భక్తులు విద్యాగణపతికి అభిషేకం చేశారన్నారు. హోమాలు, కుంభాభిషేకాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయన్నారు. కావలి నియోజకవర్గం, పరిసర ప్రాంతాలలో విద్యాగణపతి ఎక్కడ కూడా లేనందున ఇక్కడ ప్రతిష్టించుకోవడం జరిగిందన్నారు. ప్రతి కుటుంబానికి భగవంతుని ఆశీస్సులు వుండాలని ఈ దేవస్థాన అభివృద్దిలో కానీ, ఉత్సవాలలో కానీ అందరి భాగస్వామ్యంతో చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో కూడా శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఎంతో వైభవంగా ఉత్సవాలు జరుపుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం తిరివీధి ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరివీధి బ్రహ్మయ్య, హనుమకుమార్, కాంతారావు, నరహరి హరిబాబు, ఆవులమంద శ్రీనివాసరావు, సురేష్, రామకృష్ణ, మధు, ఆలయ అర్చకులు బుట్ట శేషాచార్యులు, వేదపండితులు పాల్గొన్నారు.

## అబ్దుల్‌అజీజ్‌కు రాఖీ కట్టిన సుధారాణి, భూలక్ష్మి




**నెల్లూరు ఆగస్టు 30, ప్రభాతవార్త-వైద్యం** రాఖీ పండుగను పురస్కరించుకుని బుధవారం నగరంలోని హరనాథపురంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు సభ్యుడు షేక్ అబ్దుల్‌అజీజ్ నివాసంలో ఆయన టీడీపీ మాజీ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తడకపల్లి సుధారాణి, నెల్లూరు పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మిలే అజీజ్‌కి రాఖీ కట్టి, మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజలంతా ఘనంగా జరుపుకునే రక్షాబంధన్ పండుగ సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. జీవితాంతం తమకు అండగా ఉండాలని ఆడబిడ్డలు తమ అన్నాదమ్ములకు అనురాగంతో చేతికి రాఖీ కట్టడం గొప్ప సాంప్రదాయమని అదే ఉద్దేశ్యంతో అబ్దుల్‌అజీజ్‌ను అన్నగా భావిస్తూ ప్రతి ఏడాది తాము ఆయనకు రాఖీ కట్టడం జరుగుతుందని తెలిపారు. ఇది అన్నా, చెల్లెలు, అక్కా తమ్ముళ్ళు జరుపుకునే మహత్తరమైన అనుబంధాల పండుగనన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొండూరు వనజారెడ్డి, పార్లమెంటు టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు గోడ పద్మ, పర్వీన్‌లు పాల్గొన్నారు.

## స్వతంత్ర్య పార్కులో బుద్ధ విగ్రహం పున: ప్రారంభం



**నెల్లూరుటౌన్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న స్వతంత్ర పార్కులో గౌతమ బుద్ధ విగ్రహం పున:ప్రారంభం బుధవారం గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గొప్పగా జరిగింది. నెల్లూరు నగర శాసనసభ్యులు డాక్టర్ పి.అనిల్‌కుమార్ ఘనంగా ఆవిష్కరించారు. గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అరవ రాయప్ప, ప్రధాన కార్యదర్శి కె.వి.రమణయ్య, ట్రెజరర్ నరాల పళణి, గౌరవ అధ్యక్షులు డా॥ రాచపాళెం రఘు, సంగ్వి హేమరాజ్‌జైన్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్, ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, యన్.బలరామనాయుడు, శ్రీమన్నారాయణ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో బిజెపి యువమోర్చా ప్రత్యేక పూజలు



**నెల్లూరు,ఆగస్టు30 ప్రభాతవార్త-విద్య:** భారతీయజనతాపార్టీ యెవమోర్చా జిల్లా అధ్యక్షులు గుప్త అశోక్ నాయుడు ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆధా ్యద్మిక కేంద్రాలైన దేవాలయాల్లో నఅ్యమతస్తులను పాలకమండలి సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం విచారకమన్నారు. సున్నితమైన అంశాలనకు కూడా అవగాహన లేమితో మరింత జఠిలం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దేవుడు మంచి బుద్ధి ఇవ్వాలని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించటం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన ఈ దుశ్చర్యకు వ ్యతిరేఖంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందరూ ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధాన నకార్యర్శుదులు మురుగ నరేష్, తాళ్లూరు నవీన్ కుమార్, సాంబశివారెడ్డి, విష్ణుతేజ రెడ్డి, మదన్‌సాయి రెడ్డి, సాయి కృష్ణ, హరిప్రసాద్, తిరుపతి, పృద్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన అధికారి కుటుంబాన్ని పరామర్శించిన జడ్పీచైర్‌పర్సన్ ఆనం



**నెల్లూరు అర్బన్, ఆగష్టు 30, ప్రభాతవార్త** : ఇటీవల కాశీ క్షేత్రం నందు ప్రమాదవశాత్తు మరణించిన కొడవలూరు మండలం ఈవో పీఆర్‌అండ్ ఆర్డీ శ్రీవిశ్వాసం నాగరాజు కుటుంబాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ బుధవారం పరామ ర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## నలుగు వేడుకల్లో బొల్లినేని రామారావు

**వరికుంటపాడు,ఆగష్టు 30,ప్రభాతవార్త :** మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఒంటేరు రమణయ్య సోదరుని కుమార్తె మంజుల వివాహాము సందర్భంగా బుధవారం జరిగిన నలుగు కార్యక్రమములో ఉదయగిరి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్,మాజీ శాసన సభ్యులు బొల్లినేని వెంకటరామారావు,మాజీ జెడ్పి చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ లు పాల్గొని వధువు మంజుల ను ఆశ్వీరిందించారు.ఈ కార్యక్రమములో మండల పార్టీ కన్వీనర్ చంద్రా మధుసూధన్‌రావు,మండల తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మీనారాయణ,టిడిపి నేతలు తెల్లగొర్ల వెంకటయ్య,పాలకొల్లు భాస్కర్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.


## ఎన్‌టిఆర్ సంజీవిని ఆరోగ్యరథం ద్వారా వైద్యపరిక్షలు

**వింజమూరు,ఆగస్ట్30,ప్రభాతవార్త:** వింజమూరు మండలం బుక్కాపురం గ్రామంలో బుధవారం ఎన్‌టిఆర్ సంజీవిని ఆరోగ్యరథం ద్వారా రోగులకు వైద్యపరిక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ కాకర్ల చారిటబుల్‌ట్రస్ట్ వింజమూరు కేంద్రంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని 8మండలాల్లో అనేక సేవా కార ్యక్రమాలను చేపడుతున్నారన్నారు. వింజమూరు పట్టణంలో అన్న కాంటీన్ ఏర్పాటు చేసి 5రూపాయలకే రుచికరమైన భోజనం అందిస్తున్నా రన్నారు. మహిళల జీవనోపాదికిశిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి ఉపాది కల్పిస్తున్నా రన్నారు. చిరువ్యాపారులకు తోపుడు బండ్లు , పెళ్ళి కానుకలు, అనారోగ్యబాధితులకు ఆర్థికసాయం ఇలాంటి ఎన్నో సేవాకార్యక్రమాలను చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## త్వరలో నూతన బ్రాంచ్ ప్రారంభం


**అనుమసముద్రంపేట,ఆగస్ట్30,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో సెప్టెంబర్‌నెలలో నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు నెల్లూరు సెంట్రల్‌బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శంకర్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన ఏఎస్‌పేట బ్రాంచ్‌లో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. లాఖరు గది, స్ట్రాంగ్‌రూమ్, మేనేజర్ రూమ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరు సెంట్రల్‌బ్యాంక్ పరిధిలో ఇటీవల మంజూరైన బ్రాంచ్‌ల్లో మొదటగా ఏఎస్‌పేట బ్రాంచ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. బ్యాంకులో పనులు పూర్తికావచ్చాయని సెప్టెంబర్ నెలలో ప్రారంభిస్తామని తెలిపారు. తక్కువ రెంట్‌తో లాకర్ల సౌకర్యం కల్పిస్తామన్నారు. నూతన బ్రాంచ్ మేనేజర్‌గా జాయిన్ అయిన సుబ్బారెడ్డి మాట్లాడుతూ బ్రాంచ్ పరిధిలోని గ్రామాల్లో రైతులకు ,ప్రజలకు తమబా ్యంక్ లో అకౌంట్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో రాజవోలు సొసైటీ అధ్యక్షులు కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ కార్యదర్శి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి తీర్థం పుచ్చుకున్న విడవలూరు టిడిపి నాయకులు



**బుచ్చి ఆగస్టు 30 ప్రభాతవార్త** విడవలూరు మండలం టిడిపి ఉపాధ్యాక్షులు రవీంద్ర వైసిపి తీర్థం పుచ్చుకున్నారు.పంచేడు సభలో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆయనకు కండువాకప్పి పార్టీలకు ఆహ్వానించారు. రవీంద్ర కుటుంబం మొదటి నుండి రాజకీయంగా గుర్తింపు వున్న కుటుంబం అని ఆయన తండ్రి కూడా తనకు ఎంతో ఆప్తులుగా ఉండే వారని, కొన్ని కారణాల వల్ల దూరమై టిడిపిలో చేరారని, ప్రస్తుతం రవీంద్ర జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపథకాలపట్ల ఆకర్షితులై పార్టీలో చేరారని ఆయనకు, ఆయన మిత్రులకు తప్పకుండా గుర్తింపు నిస్తామని అన్నారు.పార్టీలో చేరిన వారిని అభినందించారు.

## హిందూ దేవాలయాల పాలకమండలిలో నియమించిన అన్యమతస్తులను తొలగించాలి



**కావలి, ఆగస్టు 30 ప్రభాతవార్త** హిందూ దేవాలయాల పాలకమండలిలో నియమించిన అన్యమతస్తులను వెంటనే తొలగించాలని బిజెపి రాష్ట్ర సంయుక్త కోశాధికారి కందుకూరి వెంకట సత్యనారాయణ డిమాండ్ చేశారు. బిజెపి కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో హిందూ దేవాలయాల పాలకమండలిలో అన్యమతస్తులను, నిందితులను నియమించడాన్ని నిరసిస్తూ కావలి పట్టణంలోని శ్రీ కలుగోళ శాంభవిదేవి అమ్మవారి దేవస్థానం వద్ద మూడో రోజు బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కందుకూరి సత్యనారాయణ మాట్లాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపు మేరకు గత మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవస్థానాల వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవస్థానాలలో అన్యమతస్తులను నియమించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం హిందువుల ఆచారాలను, సంస్కృతిని నిర్లక్ష్యం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. మన పూర్వీకులు మనకు ఇచ్చిన వారసత్వ సంపదను ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా అన్యమతస్తులను దేవస్థానాల పాలకమండలిలో నియమించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వారిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. సంతకాల సేకరణ పూర్తయిన తర్వాత రాష్ట్ర గవర్నర్‌ని కలిసి రాష్ట్రంలో జరిగే హిందూ వ్యతిరేక కార్యక్రమాల గురించి వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి కావలి పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం మాట్లాడుతూ దేవాలయాలపై అన్యమతస్తుల పెత్తనాన్ని అడ్డుకునేందుకు మనమందరం కలిసి పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అసెంబ్లీ కన్వీనర్ సి.వి.సి.సత్యం, పట్టణ ప్రధాన కార్యదర్శి మంద కిరణ్‌కుమార్, బిజెవైయం ప్రధాన కార్యదర్శి కూరాకుల సవీంద్ర, మహిళా మోర్చ పట్టణ అధ్యక్షురాలు కామినేని ఉదయలక్ష్మి, కిసాన్ మోర్చ పట్టణ అధ్యక్షులు తుమాటి తిరుపతిస్వామి, ఎస్సీ మోర్చ పట్టణ ఉపాధ్యక్షులు కటకం మనోజ్‌కుమార్, కిసాన్ మోర్చ పట్టణ ప్రధాన కార్యదర్శి ముంగమూరు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.